కథానిక

# లోతు నవ్వులు

సత్యనారాయణరావు

ఆ అమ్మాయి ఒక్కసారి నవ్వింది. కొన్ని రోజులపాటు మేఘాల చాటున మాటు మణిగిపోయి ఒక్కసారి జగత్తంతా నిండిపోయేటట్టు బైటికి వచ్చిన వెన్నెలలా ఆనందం పొంగి పొర్లిపోయేటట్టు నవ్వింది. అయిదారు సంవత్సరాలకు పూర్వం నవ్విందేమో-అది బాధ ఎరుగని నవ్వు! ఇది బాధలు అతిక్రమించిన నవ్వు!

శుక్లపక్షచతుర్దశినాటి సాయంత్రం సుమారు ఎనిమిది గంటలవేళ అనంతాకాశం మీదనుంచి తొంగిచూస్తూ కౌముదీకాంత ముసిముసినవ్వులు నవ్వుతూంది. బ్రహ్మాండమైన చల్లటికాంతితో వెలిగిపోతూన్న పాదరసం దీపావళిలో సముద్రతీరం, విశ్రాంతిగా చల్లగాలి ఆవటిస్తూన్న వేలకొలదీ జనంతో కలకలలాడిపోతూంది. సమూహాలుగా, జంటలుగా వచ్చేవాళ్లు వెళ్ళేవాళ్లు - అదొక ఊహాలకందని జీవయాత్ర. దురంతమైన కష్టాలతో, నిరాశలతో కుంగిపోయిన హృదయాలు బాధోపశమనం కోసం నిరవరోధంగా విడిచిపెడుతున్న నిట్టూర్పు వాహినులను మహానదీనద జలప్రవాహాలవలె భరించి, ఆ సంతప్త హృదయాలను మలయ పవనాలతో సేదదీరుస్తున్నది మహా సముద్రం.

సముద్రతీరాన్ని నడిచి నడిచి, కళాక్షేత్రం గేటుదగ్గిర మెట్లెక్కుతూ ఆ అమ్మాయి వకుళం నవ్వింది. తనతో మెట్లెక్కుతున్న భర్త శ్రీధరరావు ముఖంలోకి చూస్తూ ఒక మధుర స్మృతిలోని భావాన్ని వ్యక్తం గావించలేని బాధతో నవ్వింది. ఎందుకో! కారణం ఆయనకు తెలియదు. అయినా నవ్వేడు ఆవిడతో కూడా తెలియక పోయినాసరే. ఎదురుగా మెట్లు దిగుతున్న నలుగురిలో ఒక సూటు నిర్ఘాంతపోయేడు వెన్నెలలాంటి ఆ నవ్వు ముఖాన్ని చూడగానే. అతన్ని చూడగానే స్విచ్ వేసినట్టు వకుళం నవ్వు ఆగిపోయింది. దీనికి కూడా కారణం శ్రీధరరావుకి తెలియదు. ఆ సూటు వేసుకున్న అబ్బాయి వకుళాన్ని తదేకధ్యానంతో చూస్తూ కీలుబొమ్మలా మెట్లు దిగేడు. వకుళం మెల్లిగా హృదయభారంతో మెట్లెక్కింది.

అసలు వకుళం ఎందుకు నవ్విందా అనే సందేహం శ్రీధరరావుకి, ఎదురుగా వచ్చిన సూటుకి, అతనితో ఉన్న ముగ్గురు స్నేహితులకి, యింకా పరిసరాల్లోనే కూర్చొని ఏదో మిసిమి జవ్వనంలోని ఒక ప్రేమ వికారమో, విలాసమో అని అనుకోక ప్రత్యేకంగా ఆవిడ నవ్వును గుర్తించిన వాళ్లకీ కలిగింది. అదిసహజం కాని తలవని తలంపుగా ఒక విద్యుత్ప్రవాహం దేహంలోంచి పరిగెత్తి నట్టపడం చేత తనకు తానే మర్చిపోయింది ఒక్కక్షణకాలం. అసలు నవ్వు రావడానికీ, ఆగిపోవడానికీ కారణం ఏదయినా నవ్విన కారణం నవ్వులోనే కరిగిపోయింది.

రెండవ వరస మెట్లెక్కేవరకూ వకుళం తల పైకెత్త లేదు. భర్త చెయ్యిపట్టుకొనే వేగంగా మెట్లెక్కింది. తల పైకెత్తేసరికి నుదుటిమీది స్వేదబిందువులలో కుంకుమరేఖ కరిగి నాసికమీదుగా ఆవిడ వక్షస్థలంమీద నాలుగు కణాలుగా జారింది. దానితో తన హృదయతాపం కొంచెం ఉపశమించింది.

భర్త వెయ్యబోయిన ఒక ప్రశ్నకు సమాధానంగా "మీకు తెలిసినదేలెండి. కష్టాలు అనుభవిస్తేగాని సౌఖ్యంలోని ఆనందం బాగా తెలియదు. పదండి యింటికి పోదాం. చెప్తాలెండి మీ ప్రశ్నకు జవాబు" అంటూ నడిచింది ఆయన చెయ్యిపట్టుకొనే. వాళ్ళిద్దరూ సందు తిరిగేవరకూ ఆ సూటు, తనకోసం స్నేహితులు వేచిఉన్నారనైనా తలవకుండా తదేకధ్యానంతో చూసేడు ఆవిడవైపు.

నాటికి మూడు నాలుగు సంవత్సరాల పూర్వం వరకూ ఒక విధమైన అమాయకత్వం

తోనూ, ఆశలెరుగని ఆనందంతోనూ రాణించిన తన లేతచిరునవ్వు, కాలక్రమేణా విపరీత పరిస్థితిలో నిరాశతో నీరసించిపోయి, చివరకి సహృదయ సాక్షాత్కారంలో పునర్జీవనం పొందగా, మళ్ళీ ఈనాటికి ఆ సూటు వేసుకున్న మనిషిని చూడగానే "ఈ అమ్మాయికి పెళ్ళవుతుందా?" అనే ప్రశ్న వెన్నలాంటి తన హృదయంలో కస్సుని గుచ్చుకున్నట్టయింది వకుళానికి.

వకుళం చక్కని చుక్క. వ్యక్తిత్వాన్ని పొందక పూర్వమే ఆ అమ్మాయిలోంచి తొంగి చూస్తున్న యవ్వన మాధుర్యం, పురుష హృదయాన్ని మకరంద దృష్టితో మత్తెక్కించ గలదని లోకం అనుకుంది. కాని వకుళం వివాహం గురించి తల్లిదండ్రులకు ఒకవిపరీతమైన సమస్య ఎదుర్కొంది. వకుళానికి ఒక మెడతిరగని మేనరికం దాపురించింది. ఐశ్వర్యానికీ, ఆప్తబంధుత్వానికీ ఆశపడి, విద్యా సంస్కారం లేక, చూస్తే ఏవగింపు కలిగే స్వరూపం గల ఆ మేనరికానికి కట్టబెట్టి తన బిడ్డ గొంతుక తెగని కత్తితో కొయ్యనని తన మనోనిశ్చయాన్ని మానవత్వం గల ఆ తండ్రి వ్యక్తపరిచేడు. ఆ క్షణంనుండి వకుళంమీద విరుచుకుపడి ఆ కుటుంబం పగ సాధించడం ప్రారంభించింది. వాళ్లు వేసిన అపవాదు కొంత పనిచేసింది. దానితో ఈ అమ్మాయికి పెళ్ళేలా అవుతుంది అనేసమస్య కొండలా ఎదురైంది. ఇంచుమించు నిశ్చయానికి వచ్చిన ఎన్నో అనుకూలమైన సంబంధాలు తప్పిపోయేయి. పగవాళ్లు నాటిన అపవాదు బీజంగానే అంకురించింది, కాని నాటిలేని చక్కదనంలోంచి మధుర యవ్వన సౌరభం విరజిమ్మే ఆ స్వరూపం అంటే విముఖత కలగడానికి [illegible] గట్టి కారణం ఉండి ఉండాలి అని జనం అనుకోక తప్పిందికాదు. కాగా పెళ్ళిసంబంధంగూర్చి వచ్చిన పైవాళ్లకు అక్కడి తమ బంధువులతోగాని, హితులతోగాని ఈ ప్రస్తావన వచ్చినప్పుడు మర్మం ఎరుగని కొందరు అమాయకులు ఈ భోగట్టా చెప్పక తప్పనూలేదు. దానితో నిశ్చయం కానున్న ఆ సంబంధాలు పుసిగిపోక తప్పనూ లేదు. ఏమైతేనేం మొత్తంమీద స్వారంతో వేసిన ఈ అపవాదు మూలంగా ఆ అమ్మాయికి ఇక వివాహం కాదు అనే మాట ఒక వాడుకపదం కింద అయి, ఆనందించేవాళ్ళకి ఒక మజాగా ఉన్నా, తల్లిదండ్రులకు, యితరుల శ్రేయస్సుకోరే ఉదారులకు చాలా బాధ కలిగించింది.

దుర్గంధంలా వ్యాపించిన ఈ అపవాదు తగిలినంతమేర తన బిడ్డకి పెళ్ళి కావడానికి ఇంక ఏవిధానా ఆశలేదని, అంతకుమించి గట్టి ప్రయత్నాలేవీ చెయ్యడానికి తనకికూడా అట్టే అవకాశాలులేవని తలపోస్తూ నిరాశతో కుంగిపోయాడు ఆ తండ్రి.

చక్కదనాలు, చట్టుబండలూ అని ఏవేవో పిచ్చిపిచ్చి ఆలోచనలు పెట్టుకొని నిక్షేపంలాంటి మేనరికాన్ని కాలదన్నుకొనే నిర్భాగ్యుడు కాకపోతే ఎదిగిన పిల్లని యింట్లో అట్టే బెట్టుకొని మీనమేషాలు లెక్కపెట్టుకోవడం పరువు, మర్యాద ఉన్నవాడి లక్షణం కాదు-అని ఇంకా ఏమేమో అనుకొనే సంకుచిత స్వభావుల మాటలు తనకి శూలాల్లా తగిలినా, పిల్ల బాగోగులు కోరే తండ్రి కాబట్టి ఈ అసందర్భపు శాపనాకారాలకు చలించకుండా చట్రాయిలా నిలబడ్డాడు.

ఎదిగిన పిల్లని యింట అట్టే బెట్టుకుంటే ఉండే సాధకబాధకాలు ఆ తండ్రికిమాత్రం తెలియదా! సూటువేసినా, బూటువేసినా, ఇంకా బంగారం కొండమీద కూర్చున్నా సరే ఆ సూటుని, వెకిలినవ్వులు నవ్వే ఆ పశువుని చిన్నప్పటినుంచీ తనకు తెలుసును గదా. అందచందాలకోసం, ఐశ్వర్యంకోసం తను అట్టే ఆశపడలేదు. కాని చూసిచూసి ప్రకృతికి పనికిరాని ఒక నిష్ప్రయోజక మానవాకారాన్ని తను ఎలా అంగీకరిస్తాడు. తెగని కత్తితో తనబిడ్డ గొంతుక కోస్తాడా!

ఎన్నికష్టాలయినాపడి ఈ అపవాదు సోకని దేశం, ఈ విషవాయువు స్పృశించని స్థలాలకు పోయి తన కంఠంలో ప్రాణం ఉండగానే కూతురు సుఖపడేమార్గం చూడాలని నిశ్చయించేడు గట్టి గుండెగల ఆ మనిషి.

మొత్తంమీద ఎలా అయితేనేం ఒక సంవత్సరంపాటు శ్రమించి దేశాలు కాని దేశాలు

దాటిపోయి అలభ్యయోగంగా సందర్భపడిన చిన్ననాటి ఒక స్నేహితుడిని కలుసుకున్నాడు. బంధుత్వం కన్న, అభిమానం కన్న, ప్రేమ కన్న అతీతమైనది ఆ అనుబంధం. ఒక కంచంలో తిని, ఒక మంచం మీద పడుకొని ఒక చెప్పలేని అనుబంధంతో కొన్ని సంవత్సరాలు గడిపిన ఆ బాల్యస్నేహితులు ఒక్కసారి ఒకరినొకరు కౌగిలించుకున్నారు. చివరకి తన హృదయాంతర్గతమైన ఆవేదన తెలియబరచేడు స్నేహితుడితో వసుళం తండ్రి. దైవమే తోడు పడ్డాడో లేక పరిస్థితులే అలా తలవని తలంపుగా సందర్భపడ్డాయో కాక తాళీయంగా ఆ పుణ్యాత్ముడు ఒక అనుకూలమైన సంబంధం చూసి, వధూవరుల తండ్రుల నిరువురినీ ముఖాముఖిచేసి, సంబంధం నిశ్చయంగావించి, పుణ్యం గట్టుకున్నాడు.

సంప్రదాయ గౌరవాలే, ముఖ్యంగా పాటించే తగు మనిషి కాబట్టి ఈ సంబంధం చేసుకోడానికి అంగీకరించేడు పెండ్లి కొడుకు తండ్రి. వధువు ఫొటో చూసి అంతా తల ఊపేరు అంగీకార సూచకంగా. అయితే పిల్లకి ఈడు కొంచెం ముదిరింది. పైగా తన స్వస్థలానికి పరిసరాల్లో ఏమీ సంబంధాలు లేనట్టు ఇంత దూరాభారం వచ్చి ఆయన ఎంతో ప్రాధేయపడడానికి, చక్కదనాల బొమ్మ ఆ అమ్మాయికి అంత ఈడుముదిరే వరకూ వివాహం కాకపోవడానికి కారణం? అనే ప్రశ్న అక్కడున్న తలనెరిసిన పెద్దలలోంచి రాక పోలేదు. భయంకరమైన ఆ సమస్యను ఎలా సాధించడం అని కొంచెంసేపు దిగులుపడ్డాడు వసుళం తండ్రి. చివరకి "వారి జాతులందు, వైవాహికములందు" అన్నట్టు సత్యాసత్యాలు జతచేసి ఏదో తృప్తికరమైన సమాధానమే చెప్పగలిగేడు ఆయన. వారి అంగీకారం తీసుకొని బ్రతుకు జీవుడా అని బయలుదేరే ముందు మరొక ఆలోచన తట్టింది ఆయనకి. వివాహం తన గ్రామంలో జరిగితే ఏం అభాస అవుతుందో అని, వియ్యాలవారింట్లోనే వివాహం జరిగేటట్టు పరిస్థితులు అనుకూలపరుచుకొని వారి సమ్మతంపైన యిల్లు చేరుకున్నాడు.

రెండు రోజుల వ్యవధివరకూ ఈ విషయం పరమ రహస్యంగా ఉంచి, సతీసుత సమేతంగా ఆనాటికి వెళ్ళిపోయేడు వసుళం తండ్రి వియ్యాలవారి గ్రామం. ఎక్కడికి వెళ్ళేరో ఎవరికీ తెలియదు. కక్షదారులంతా చాలా శ్రమించేరు రహస్యం బైటపెట్టి రసభంగం చెయ్యడానికి. కాని వాళ్ల ప్రయత్నాలు వృథా అయేయి.

వసుళం వివాహిత అయింది. మగ పెళ్ళివారి అభిమతానుసారం పునస్సంధానం కూడా వెంటనే నిశ్చయం చేయబడింది.

వివాహం నిశ్చయమైందని తెలిసి, అందు నిమిత్తం యిల్లు విడిచిపెట్టిన క్షణంనుండీ వసుళానికి ఆందోళనతో కూడిన ఒక ఆనందానుభూతి కలిగింది. సంఘం కల్పించిన అడ్డంకులను అతిక్రమించగలిగింది తను. కాని అందుకు తన వాళ్లు చేసిన దోహదం, చెయ్యక విధిలేని పరిస్థితులు తల్చుకున్నప్పుడు చిగురాకులాంటి తన హృదయం స్పందించిపోతూండేది వెయ్యి ఆలోచనలతోనూ, లక్ష ఆందోళనలతోనూ. తనవాళ్ళద్వారా తను భర్తకుచేసినది గొప్ప అన్యాయం, అపకారం అని ఆవిడ ఎంతో బాధపడ్డది. యవనికాభ్యంతరంలో తాము ఆడిన నాటకానికి పర్యవసానం ఏవిధంగా పరిణమిస్తుందో తల్చుకుంటే వసుళం గుండెల్లో రైళ్లు ఢీకొన్నట్టయేది. కాని ఏంచేస్తుంది. తనకు అతీతమైపోయిన పరిస్థితులలో తను ఏ అభిప్రాయం వెలిబుచ్చడానికిగాని, ఏపని చెయ్యడానికిగాని సాధ్యంకాలేదు. తను ఎన్నివిధాలుగా ఆలోచనలుచేసినా, ప్రయత్నించి తనను తను ఎంత సమర్థించుకో తలచినా వృథాఐంది. అవివాహితగా ఆశలు అంతరించిపోయిన అభ్యంతరంలో నిరాకరింపబడి మాటు మణిగిపోయిన తనను వెలుగులోకి తెచ్చి నవ్వించిన ఒక అంతశ్శుద్ధి తనకు ఒక తియ్యటి బాధను కలిగించింది. ఉప్పెనలా పొంగివస్తూన్న ఆ వేదనతో బాధపడేది అంతకన్న చేసేదంలేక! ఆ నవ్వుల నాటకంలోని తన ఆవేదనాపూరితమైన ఘట్టం ఏవిధంగా పరిసమాప్తి అవుతుందో అని యోచిస్తూ కోటి ఆలోచనలతో బాధపడుతున్న తన హృదయం తదేకదీక్షతో విలోకిస్తూండేది.

ఆ వేళ సాయంత్రం సుమారు ఎనిమిదిగంటలయింది. పవిత్ర మంత్రోచ్చారణలతో, తరువాత శోభనదేవతల శృంగార లాంఛనాలతో, నవ్వులతో, ఆటలతో పాటలతో కొన్ని ఘడియలు గడిచి సుముహూర్తం సమీపించింది. భూతల స్వర్గారోహణకు ప్రథమ సోపానం అధిష్టించిన ఆ దంపతుల్ని ఆశీర్వదిస్తూ బంధుమిత్రబృందం శృంగారాలు శోభిస్తూన్న ఆ గదిలోంచి నిష్క్రమించింది. తలుపులు మూత పడ్డాయి.

నిశ్చలంగా, గంభీరంగా పాన్పు ప్రక్కనే ఉన్న కుర్చీలో కూర్చొని శ్రీధరరావు, పాన్పు నానుకొని చంద్రకాంత శిలాసాల భంజికలా అధోముఖియై నించున్న ఆ త్రపావతిని, తన అర్ధాంగిని, చిరునవ్వుతో రెండు నిమిషాలు సేపు చూసేడు. మరుక్షణంలో 'వకుళం' అని పిలిచేడు ప్రశ్నార్థకంగా! జవాబు లేదు. అటువంటి పరిస్థితిలోని మౌనం సాధారణంగా స్త్రీసహజమైన సిగ్గు అనుకుంటుంది లోకం-నిజంకూడా అదే కాబట్టి. కాని ఆ సమయంలో ఆ అమ్మాయి హృదయంలో ఆందోళన, బాధ రేకెత్తించే అంతర్వాహినులు పరిగెడుతున్నాయని బాహ్యప్రపంచానికేం తెలుస్తుంది!

పది సెకండ్లు ఊరుకొని 'వకుళం' అని మళ్లీ పిలిచేడు శ్రీధరరావు ఒకవిధమైన అనుబంధపూర్వకంగా! కాని అసిఘాతంలాంటి లోకాపవాదంతో గాయపడ్డ తన హృదయం ఆ పిలుపులో అనిర్వచనీయమైన అంతశ్శుద్ధి ఉందో లేదో ఎలా నిర్ణయించుకోగలదు!

భర్త ఎదురుగా నించొని, అధికార పూర్వకంగానో, అనురాగ పూరితంగానో భర్త తనను పిలుస్తూంటే- ఒకసారి కాదు, రెండుసార్లు- ఊపిరితీస్తూన్న తను ఎలా మౌనం వహించడం, లేక ఏంచెయ్యడం అని తనకు తను ప్రశ్న వేసుకొనేసరికి హృదయం ఒక్కసారి స్పందించి పోయింది. గంభీరంగా కుర్చీలోంచి లేచి వకుళం దగ్గరగా వచ్చేడు శ్రీధరరావు. కోమలమైన వకుళం చెయ్యిని తనచేత పట్టుకోగానే అనిర్వచనీయమైన ఒక హృదయావేదన ఆ అమ్మాయిలోంచి తనలోకి పరిగెత్తినట్టయింది విద్యుత్తులా. ఎడంచేత్తో వకుళాన్ని యింకా తన చేరువకు తీసుకొని, కుడిచేత్తో ఆమె పల్లవాధరాన్ని పట్టి ముఖం పైకెత్తేసరికి కన్నీరు కనిపించింది వాహినిగా ప్రవహిస్తూ. ప్రథమ ముఖావేక్షణతో వకుళం అచేతనంగా ఆయన పరిష్వంగంలోంచి జారిపోతున్నది. చట్టున వకుళాన్ని తన రెండుచేతులతో ఎత్తుకొని పాన్పుమీద తన ఒడిలో ఏటవాలుగా కూర్చోబెట్టుకొని, చేతిరుమాలుతో కన్నీరు తుడుస్తూ లాలనతో 'వకుళం' అని పిలిచేడు ఆ సహృదయుడు. మరుక్షణంలో కళ్లు విప్పి వకుళం చప్పున లేవబోయింది. కాని శ్రీధరరావు 'లేవకు వకుళం' అంటూ ఆవిడ శిరోజాలను నిమిరేడు.

మూర్తీభవించిన దయా స్వరూపంలాగ ఆయన వకుళాన్ని చూస్తూ, ప్రేమానురాగాలు వెల్లివిరిసేటట్టు ఒక చిరునవ్వు నవ్వి 'వకుళం! ఎందుకలా ఆందోళన పడుతున్నావు చెప్పు. ఏ కారణంచేతనైనా నీ మనస్సుకి నొప్పికలిగిందా? నాతో చెప్పడానికి నీ కభ్యంతరం ఎందుకు! చెప్పు వకుళం చెప్పు' అని అన్నాడు.

తను వేయించుకున్న ఈ ప్రశ్నకు తనే సమాధానం చెప్పవలసిన ఆ క్షణంలో ఏం చెయ్యాలో, ఎలా సమాధానం చెప్పాలో, అందువల్ల తనజీవితనాటక పర్యవసానం ఏమవుతుందో అనే ఆవేదనతో అతలకుతలం అయిన తన హృదయంలోంచి ఒక కోటి ఆలోచనల దండు తుపానులా చెలరేగింది. గుండెలో ఒక కొండ పడ్డట్టయింది. వివాహం ముగిసిన మరుక్షణం నుంచీ బాధిస్తూన్న ఈ విషయం తన హృదయాన్ని నడిసముద్రంలో తుపానుకి చిక్కిన నౌకవలె ఉక్కిరిబిక్కిరి గావించింది. కాని నవనీతంలాంటి తన హృదయం కౌటిల్యాన్ని ఊహించలేదు, స్వార్థంకోసం సత్యాన్ని మరుగుపరచలేదు. తత్ఫలితంగా ఏ మహావిపత్తు సంభవించినా సరే తనూ సంసిద్ధురాలే!

లేచి తన భర్త ఎదురుగా నించొని ఆయన చెయ్యి తన రెండుచేతులతో పట్టుకొని ఏదో చెప్పబోయింది. కాని ధైర్యంచాలక గోరువంకలా వణికిపోయింది. శ్రీధరరావు వకుళాన్ని యింకా తన చేరువగా తీసుకున్నాడు. స్పందించిపోతున్న తన అర్ధాంగి కోమల శరీ

రాన్ని గట్టిగా అదిమిపట్టుకొని 'చెప్పు వకుళం నీకేమీ భయంలేదు. నేనున్నానుగా' అన్నాడు.

హృదయంలో ఘూర్ణిస్తున్న ఆవేదన ఉప్పెనలా బైటికి పొంగివచ్చి కన్నీటి ధారలుగా ప్రవహిస్తూంటే, గుండె రాయిచేసుకొని వకుళం తన భర్త వేసిన ప్రశ్నకు జవాబు చెప్పింది.

"క్షమించండి! నేను చేసినది మహాపరాధం. మీకు చాలా ద్రోహం చేశాను. ఆడ పిల్లలను కనిన తల్లిదండ్రుల బాధా ఫలితం అది. దానికి బాధ్యురాలను నేను. సత్యదూరం కాని లోకాపవాదు మీరెరుగరు. అది మీ నేలను స్పృశించలేకపోయింది. అమాయకంగా కులగౌరవ సంప్రదాయాలకు కట్టుబడి, అంగీకారాన్ని చూపింది మీ సహృదయత. కాని దానితో నాఆవేదన అంతకంతకు అధికంఅయిపోయింది. స్వచ్ఛ స్ఫటిక సన్నిభమైన మీ హృదయానికి నాలో దాగిన రహస్యాన్ని నివేదించుకుంటాను. ఈ జీవితం ఏమయిపోయినాసరే, పెను ప్రళయంలో ఎక్కడికో కొట్టుకు పోయినాసరే, నాలో దాగిన రహస్యం, అందుమూలంగా శరీరాత్మలను దహించివేస్తున్న బాధ, శరీరంలోని నెత్తురు మూలంగా స్రవించిపోతే నా బాధోపశమనం అవుతుందని ఆశపడుతున్నాను. నా శరీరాత్మలపై ఈ క్షణం నుండి సర్వాధికారం చలాయించగల మీకు అభ్యంతరంలో ప్రాగ్యం కాగల వస్తువులేదు! పరీక్షచేసి శిక్ష విధించడి! అని అంటూ అమాయకత్వం ఆకృతి వహించి, అచేతనంగా ప్రతిమలా నించున్న వకుళాన్ని ఒక దివ్యానుభూతితో గట్టిగా కౌవలించుకున్నాడు శ్రీధరరావు. మహాసముద్రం వంటి తన హృదయపు లోతుల్లోంచి అనిర్వచనీయమైన అంతశ్శుద్ధి, దయ, ప్రేమ, అనురాగం సహనాలుగా పొంగి పొర్లిపోతూంటే "పిచ్చిదానా! ఈపాటి దానికేనా మనస్సును కష్టపెట్టుకున్నావు. అదినాకే సంభవించి ఉంటే? లోకం నాకొసమని నిన్ను నిరాకరించింది! నిన్ను పరిగ్రహించమని విధి నన్ను ఆజ్ఞ పెట్టింది బాధపోయేటట్టు నవ్వు వకుళం ఒక్కసారి! అని తన అర్ధాంగి కన్నీరు తుడుస్తూ, ఆమె లలాటాన్ని ఒక్కసారి చుంబించి ఎదురుగా ఉన్న గడియారం వైపు చూసేసరికి అర్ధరాత్రి అయింది. భూతల స్వర్గంలో ఆ యిద్దరూ ఆనంద నిమగ్నులయిపోయారు.

సముద్రతీరాన్ని నవ్విన వకుళం నవ్వుకు కారణం సముద్రం అంత లోతుగలదై ఉండాలని ఇల్లు చేరుకున్న తరువాత తెలుసుకొని తను కూడా నవ్వేడు శ్రీధరరావు, ఆనవ్వుల సముద్రపు లోతులు తెలుసుకోడానికి!

చైతన్య స్రవంతి

# నిష్కామ యోగం

"అమగశ్రీ"

భార్యమీద అలిగిన వెంకట్రావు వీథిన బడ్డాడు రాత్రి పదకొండు గంటలకు. సగం చీకటి సగం వెలుతురులో బజారంతా అదో రకంగా ఉన్నది. జేబులో చెయ్యి పెట్టాడు. ఒక సిగరెట్ పాకిట్, అగ్గిపెట్టె, కొస్త చిల్లర చేతికి తగిలినయ్. సిగరెట్ వెలిగించి ముక్కుకు నూటిగా బయలుదేరాడు.

ఈవిధంగా ముక్కుకు నూటిగా బయలుదేరి ఎన్నాళ్ళయిందో? ఎప్పుడో చిన్నతనంలో బళ్ళో చదువుకొనేటప్పుడు, పెళ్ళి కాకముందు మాట అదంతా. పెళ్ళయిన తరువాత మాత్రం? గుదిబండ మెళ్ళో ఉన్నా, ముక్కుకు నూటిగానే పోయాడు కొన్నాళ్ళు. రోజురోజుకూ తను పెద్దవాడయ్యాడు. గుదిబండ కూడా పెద్దదయి బరువెక్కింది. అందువలన ఈమధ్య స్వైర విహారాలరుచి అసలు ఎరుగనేఎరగడు.

మొత్తంమీద ఈపూట తను బయటపడగలిగాడు. ఎలాగైతేనేం? అదంతా తరువాత